అత్తమామల వేధింపులకు
తల్లీకుమారుడు బలి
- రెండేళ్ల కొడుకును చంపి.. తానూ ఆత్మహత్య
- భర్త ఆరు నెలల క్రితమే మృతి

8

సీఎంపైనే ఆశలు



హుస్నాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారిగా హుస్నాబాద్‌కు వస్తుండటంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొన్నది. బుధవారం మధ్యాహ్నం 1గంటకు హెలికాప్టర్ ద్వారా చేరుకోనున్న ముఖ్యమంత్రి... అమరవీరుల స్థూపం వద్ద జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా దాదాపు రూ. 262.68 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో మంత్రి పొన్నం ప్రభాకర్ రెండు రోజులుగా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సీఎం రాకతో తమ ప్రాంతానికి వరాల జల్లు కురుస్తుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- నేడు హుస్నాబాద్‌కు రేవంత్‌రెడ్డి
- రూ. 262.68 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- పట్టణంలో భారీ ఏర్పాట్లు
- గండిపల్లి, గౌరవెల్లి రిజర్వాయర్ హామీల అమలుపై ఉత్కంఠ..
- బహిరంగ సభ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌లో జరిగే బహిరంగ సభ వేదిక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రారంభించనున్న ప్రధాన అభివృద్ధి పనులు

బహిరంగ సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మొత్తం రూ.262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. శాతవాహన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల భవనాలు నిర్మాణానికి (రూ. 44.12 కోట్లు), హుస్నాబాద్- అక్కన్నపేట ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణానికి (రూ. 58.91 కోట్లు), హుస్నాబాద్ పట్టణ అభివృద్ధి పనులకు (రూ. 20కోట్లు), ఆర్డీఏ భవనం నిర్మాణానికి (రూ. 8.5కోట్లు), ఏటీసీ కేంద్రం ఏర్పాటుకు (రూ. 45.15కోట్లు) హుస్నాబాద్-కొత్తపల్లి ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణానికి (రూ. 86 కోట్లు) శంకుస్థాపన చేయనున్నారు. వీటితో పాటు ఇంజనీరింగ్ విద్యార్థులకు సైకిళ్లు, హైదరాబాద్‌కు సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సును సైతం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

ఏరాట్లు పూర్తి.. బందోబస్తు పటిష్టం

సీఎం పర్యటన సందర్భంగా హుస్నాబాద్ కాంగ్రెస్ జెండాలు, కటౌట్లు, ఫ్లెక్సీలతో నిండిపోయింది. అమరవీరుల స్థూపం వద్ద 10 ఎకరాలకు పైగా ఉన్న మైదానంలో వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా రెయిన్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేశారు. ఎల్‌ఈడీ స్క్రీన్లు, మంచినీటి వసతి వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇక మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం అధికారులతో మాట్లాడుతూ పనులను పరుగులు పెట్టించారు. సీఎం భద్రత దృష్ట్యా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 350 మంది పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీపీ విజయ్‌కుమార్ స్వయంగా సభా ప్రాంగణం, హెలీప్యాడ్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

వరాల జల్లు కురిసేనా..

హాత్‌సే హాత్ జోడో యాత్రలో భాగంగా 2 మార్చి 2023న రేవంత్‌రెడ్డి హుస్నాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు. ముఖ్యంగా ఆనాడు గౌరవెల్లి రిజర్వాయర్‌తో పాటు గండిపల్లి రిజర్వాయర్‌ను ప్రాధాన్యంగా తీసుకొని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం గౌరవెల్లి కాలువ పనులకు భూసేకరణ జరుగుతుండగా, గండిపల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాల్సి ఉంది. నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేయడంపై ఆనాడు తీవ్రంగా స్పందించిన రేవంత్‌రెడ్డి, సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ జెండా ఎగరాలని

మిగతా 10లో...

ముగిసిన రెండోవిడత

నామినేషన్ల ఘట్టం

- సిద్దిపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో మూడు రోజుల ప్రక్రియ పూర్తి
- చివరి రోజు పలు గ్రామాల్లో నామినేషన్ల కోసం అభ్యర్థులు బారులు
- లెక్కతేల్చే పనిలో అధికారులు



నంగునూరు మండలం గట్లమల్యాలలో నామినేషన్ దాఖలు చేసేందుకు క్యూలో నిల్చున్న అభ్యర్థులు



సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో ఓ అభ్యర్థి నామినేషన్‌లో బోనమెత్తి ర్యాలీలో పాల్గొన్న జోగిని శ్యామల

సిద్దిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో రెండో విడత నామినేషన్ల స్వీకరణ మంగళవారంతో ముగిసింది. నవంబరు 30న ప్రారంభమైన మూడు రోజుల నామినేషన్ల ప్రక్రియలో తొలి రెండు రోజులు కోలాహలంగా, డప్పుదరువుల మధ్య అభ్యర్థులు తమ బంధుమిత్రుల మద్దతుతో నామినేషన్లు దాఖలు చేయగా... చివరి రోజు మంగళవారం మాత్రం కొందరు అభ్యర్థులు భావోద్వేగాల మధ్య తమ నామినేషన్లను వేశారు. రెండో విడతలో సిద్దిపేట రెవెన్యూ డివిజన్‌లోని అక్బర్‌పేట-భూంపల్లి, బెజ్జంకి, చిన్నకోడూర్, దుబ్బాక, మిరుదొడ్డి, నంగునూరు, నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, తొగుట సహా 10 మండలాలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించారు.

నామినేషన్ల లెక్కతేలుస్తున్న అధికారులు

రెండు రోజుల్లో మొత్తం 182 సర్పంచ్ స్థానాలకు 701 నామినేషన్లు, 1644 వార్డు స్థానాలకు 1821 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు మంగళవారం అభ్యర్థులు భారీగా తరలిరావడంతో, నిర్ణీత సమయం సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్నవారికి టోకెన్ అందించి దరఖాస్తులను స్వీకరించారు. దీంతో సిద్దిపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తంగా ఎంతమంది నామినేషన్లు వేశారో లెక్క తేల్చేందుకు అధికారులకు సమయం కాస్త ఆలస్యం కానుంది.

నేటి నుంచి మూడో విడత
నామినేషన్ల స్వీకరణ

హుస్నాబాద్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చివరి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, మద్దూర్, దూళిమిట్ట మండలాలతో పాటు జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, కొండపాక, కుకునూర్‌పల్లి మండలాల్లోని 163 గ్రామ పంచాయతీలకు 1432 వార్డులకు చివరి విడత నామినేషన్లు జరుగనున్నాయి. నేటి నుంచి ఈనెల5 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు.

మండలాలు	పంచాయతీలు	వార్డులు
హుస్నాబాద్	17	140
కోహెడ	27	244
అక్కన్నపేట	38	306
మద్దూర్	10	98
దూళిమిట్ట	11	94
చేర్యాల	20	184
కొమురవెల్లి	11	100
కొండపాక	15	146
కుకునూరుపల్లి	14	120

సర్పంచ్ అభ్యర్థి, భర్త కంటతడి

సర్పంచ్‌గా పోటీ చేస్తున్న తన భార్యను దీవించి గెలిపించాలని కోరుతూ సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సన్‌పల్లి గ్రామానికి చెందిన నాగుల ప్రశాంత్, అభ్యర్థి అయిన తన భార్య స్రవంతితో కలిసి కంటతడి పెట్టారు. గతంలో గ్రామ ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించిన స్రవంతి...

మిగతా 10లో...

కస్తూర్బాలో కక్కుర్తి

- ఆయిల్ ప్యాకెట్లు, పల్లీలు, మినపప్పుతో పట్టుబడిన సిబ్బంది
- ఇతర వస్తువుల తరలింపుపై అనుమానాలు

చేర్యాల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో కొంతకాలంగా నిత్యావసర సరకులు పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం సరుకులు అందజేస్తుంటే, అధికారుల పర్యవేక్షణ లోపంతో అవి దుర్వినియోగం అవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి నిదర్శనంగా మంగళవారం సాయంత్రం కొందరు సిబ్బంది నిత్యావసర సరుకులతో పట్టుబడిన సంఘటన చోటుచేసుకుంది. సుమారు 250 మంది విద్యార్థినులు చదువుకునే ఈ పాఠశాలలో.. రోజువారీ భోజనం వండిన అనంతరం సిబ్బంది ఇంటికి వెళుతున్న క్రమంలో ఉపాధ్యాయులు వారి సంచులను తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద 3 విజయ ఆయిల్ ప్యాకెట్లు, మినపపప్పు, పల్లీల ప్యాకెట్లు లభ్యం కావడంతో ఉపాధ్యాయులు అవాక్కయ్యారు. చేసేదేమీ లేక, స్థానికంగా అందుబాటులో లేని ప్రత్యేకాధికారికి ఈ విషయాన్ని చేరవేశారు.

కలెక్టర్ హైమావతి ఇటీవలి కాలంలో చేర్యాల కస్తూర్బాను పలు మార్లు ఆకస్మిక తనిఖీలు చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ, నిత్యావసర సరుకులు పక్కదోవ పట్టడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తతంగం ఎన్నాళ్ల నుంచి సాగుతోంది, కేవలం ఆయిల్ ప్యాకెట్లకే పరిమితమైందా? లేక మరే ఇతర వస్తువులను తరలిస్తున్నారా? అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇక గతంలో ఒకరు విద్యార్థులకు వచ్చిన బెడ్‌షీట్లలో కొన్నింటిని తీసుకువెళ్లడమే కాకుండా, ప్రతి వారం కూరగాయలను సరఫరాదారుడి నుంచి తీసుకెళ్తున్నారన్న ఆరోపణలున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే సిబ్బంది ఈ తరలింపునకు ఒడిగట్టినట్టు చర్చించుకుంటున్నారు. అయితే, సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచిచూడాలి.

పాఠశాలకు వెళ్లి తెలుసుకుంటా

ఆయిల్ ప్యాకెట్లు, సరుకులతో సిబ్బంది పట్టుబడిన విషయం నాకు తెలిసింది. అది నిజమో, కాదో పాఠశాలకు వెళ్లిన తరువాత తెలుసుకుంటా.

- కృష్ణవేణి, ప్రత్యేక అధికారి



తనిఖీలో పట్టుబడిన ఆయిల్‌ప్యాకెట్లు, పల్లీలు



వైభవంగా లక్ష పుష్పార్చన

వర్గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో మంగళవారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి విశేష పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ వేద పండితులు మంత్రోశ్చరణల మధ్య లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా పూర్తి ఏర్పాట్లు చేశారు

సంబురంగా స్పోర్ట్స్‌మీట్

- పీఎంశ్రీ స్కూల్స్ జిల్లాస్థాయి పోటీలు షురూ..

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి పీఎం శ్రీ స్కూల్స్ స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం క్రీడాజ్యోతిని వెలిగించి జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి రోజులో కొంత సమయాన్ని తప్పకుండా క్రీడల కోసం కేటాయించాలన్నారు. స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ సౌందర్య మాట్లాడుతూ ఇక్కడ గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అర్హత పొందుతారన్నారు. మొదటిరోజు బాలికల విభాగం, బుధవారం బాలుర విభాగంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదటిరోజు జరిగిన స్పోర్ట్స్‌మీట్‌లో దాదాపు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారని, 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులు సేవలందించారని తెలిపారు.

విజేతలు వీరే

ఖోఖోలో మొదటి స్థానం హెచ్‌ఎస్ రాయపోల్, రెండో స్థానంలో సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల. కబడ్డీలో మొదటి స్థానం సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల, రెండోస్థానం జడ్పీహెచ్‌ఎస్ సింగన్నగూడ. వాలీబాల్ మొదటిస్థానం టీజీఎంఎస్ ముత్రాజ్‌పల్లి, రెండో స్థానం జడ్పీహెచ్‌ఎస్ కూకునూర్‌పల్లి, 100 మీటర్ల ఈవెంట్‌లో మొదటి స్థానం హారిక, సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల. రెండోస్థానం బి. ఐశ్వర్య, టీజీఎంఎస్ మద్దూరు. మూడో స్థానం అనన్య, జడ్పీహెచ్‌ఎస్ సింగన్నగూడ. లాంగ్‌జంప్ మొదటి స్థానం బి.ఐశ్వర్య, టీజీఎంఎస్ మద్దూరు. రెండోస్థానం జె.జాహ్నవి సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల. మూడో స్థానంలో కె. శివాని టీజీఎంఎస్ ముస్త్యాల. షార్ట్‌పుట్‌లో మొదటిస్థానం అలీషా, టీజీఎంస్ ఇబ్రహీంనగర్. రెండోస్థానం ఎస్.అక్షయ, సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల. మూడోస్థానం ఈ. మౌనిక టీజీఎంఎస్ ముస్త్యాల. వీరికి బహుమతులను ప్రదానం చేశారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

మటన్ బిర్యానీ రూ.150..
చాయ్‌కి రూ.10
- సర్పంచ్ ఎన్నికల ప్రచార ఖర్చులు ఇలా..

9

ఎన్నికల కోసం
పల్లెబాట
- గ్రామాల్లో తిష్ట వేసిన పట్నం వాసులు
- వారిని, వారి కుటుంబాలను వింతగా చూస్తున్న ప్రజలు
- గ్రామం పట్టుకుని ఉన్న వాళ్లకే మద్దతు పలుకుతున్న జనం

9

మంచు కురిసే వేళలో..

సిద్దిపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున పొగమంచు కమ్ముకుంది. ఉదయం 10 గంటల వరకు కూడా పొగమంచు అలుముకునే ఉంది. జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకుని తమ ప్రయాణాన్ని కొనసాగించారు. దుద్దెడ టోల్‌గేటు వద్ద, సిద్దిపేట కోమటిచెరువు వద్ద పూర్తిగా పొగమంచు కమ్ముకోవడంతో పలువురు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.

- కొండపాక/చేర్యాల/ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట



పొగమంచులో కోమటిచెరువు సస్పెన్షన్ బ్రిడ్జి



లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు



దుద్దెడ టోల్‌గేట్ వద్ద..



చేర్యాలలో పొగమంచు నడుమ ఉదయిస్తున్న సూర్యుడు

భార్యను చంపి.. భర్త ఆత్మహత్య

టేక్మాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను దారుణంగా హతమార్చి.. ఆపై అతను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా టేక్మాల్‌లో చోటు చేసుకుంది. ఇద్దరూ కలిసి పడుకున్న సమయంలో దిండుతో ఆమె ముఖంపై అదిమిపెట్టి చంపేసి.. తర్వాత తను దూలానికి ఉరి వేసుకున్నట్లు అక్కడి పరిస్థితులు ఉన్నాయి. మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన గంగారాం


శ్రీశైలం, మంజుల(ఫైల్)

శ్రీశైలం(37), గంగారాం మంజుల (34) భార్యాభర్తలు. వీరికి ఇంటర్ చదివే కుమారుడు ఉన్నాడు. అతనికి షుగర్ ఉండటంతో రోజూ డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి. ఊర్లో ఉన్న ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చి.. కుమారుడి వైద్యం కోసం శ్రీశైలం, మంజుల దంపతులు హైదరాబాద్ వెళ్లారు. అక్కడ కుమారుడికి వైద్యం చేయిస్తూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. దసరా సందర్భంగా గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని ఇరుగుపొరుగు వారు చెప్పారు. మంజుల పుట్టిల్లు అయిన మండలంలో అసద్‌మహ్మద్‌పల్లి వెళ్లింది. భర్త వేధింపులపై పోలీసులను ఆశ్రయించింది. ఇరువర్గాల పెద్దలు కూర్చొని నచ్చజెప్పడంతో ఆమె మళ్లీ భర్తతో వచ్చింది. కుమారుడు మాత్రం అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. సోమవారం రాత్రి భార్యభర్తలు నిద్రించారు. మంగళవారం ఉదయం శ్రీశైలం సోదరుడు వచ్చి చూడగా ఒకరు నిద్రలోనే చనిపోయినట్లుగా, మరొకరు దూలానికి ఉరి వేసుకుని కనిపించారు. దగ్గరికి వెళ్లి చూడగా, అప్పటికే ఇద్దరూ చనిపోయి ఉన్నారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న క్రమంలో భార్యకు వివాహేతర సంబంధం ఏర్పడిందని భర్త అనుమానించి.. ఇంటికి తీసుకవచ్చాడని, ఈ క్రమంలోనే ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు.

ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు


విజయం సాధించిన సంగారెడ్డి బి జట్టు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా నిర్వహిస్తున్న అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఉత్కంఠగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం బీవీఆర్ సింగాపూరం క్రికెట్ మైదానంలో సంగారెడ్డి ఎ జట్టు, సిద్దిపేట పింక్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన సిద్దిపేట పింక్ జట్టు 31.2 ఓవర్లలో 89 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం సంగారెడ్డి ఎ జట్టు 17.2 ఓవర్లలో 91 పరుగుల చేసి విజయం సాధించింది. కాగా రెండో లీగ్ మ్యాచ్ ఎస్‌వీఎం గగన్‌గ్రౌండ్‌లో సిద్దిపేట ఆరెంజ్, సంగారెడ్డి బి జట్ల మధ్య జరిగాయి. మొదట బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి బి జట్టు 49.4 ఓవర్లలో 274 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సిద్దిపేట ఆరెంజ్ జట్టు 44.5 ఓవర్లలో 151 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 124 పరుగులతో సంగారెడ్డి బి జట్టు విజయం సాధించింది.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

రేగోడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఓ హోటల్లో తనిఖీ చేయగా 6.60 లీటర్ల మద్యం లభించింది, దీని విలువ రూ 3750 ఉంటుందని ఎస్‌ఐ పోచయ్య తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం నిల్వ ఉంచిన, బెల్టు షాపులు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం నిలువలపై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ 50 వేలకు మించి తీసుకెళ్లద్దని సూచించారు.

అత్తమామల వేధింపులకు తల్లీకుమారుడు బలి

● రెండేళ్ల కొడుకును చంపి.. తానూ ఆత్మహత్య
● భర్త ఆరు నెలల క్రితమే మృతి

చిన్నశంకరంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అత్తమామల వేధింపులకు తల్లికుమారుడు బలయ్యారు. రెండేళ్ల తన కొడుకును ఊపిరాడకుండా చేసి చంపిన తల్లి.. తరువాత తానూ ఆత్మహత్య చేసుకున్నది. ఈ హృదయ విదారకమైన ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాపూర్ గ్రామానికి చెందిన తాళ్ల ప్రవీణ్‌గౌడ్‌తో నార్సింగి మండలం సంకాపూర్ గ్రామానికి చెందిన అఖిల(23)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు రియాన్స్‌గౌడ్(2) సంతానం. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించే ప్రవీణ్‌గౌడ్ ఆరునెలల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అప్పటినుంచి అఖిలకు అత్తమామలతో నిత్యం గొడువలు జరుగుతున్నాయి. కుమారుడిని ఇక్కడే వదిలి తల్లిగారింటికి వెళ్లిపోవాలని వేధింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపానికి గురైన అఖిల ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు మూసి గడియ వేసుకుని కుమారుడికి ఊపిరాడకండా చేసి చంపేసింది.


కొడుకు రియాన్స్‌గౌడ్‌తో అఖిల

అనంతరం ఆమె చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులు తలుపులు బాదినా తీయకపోవడంతో గడియను పగలగొట్టి ఇంట్లోకి వెళ్లగానే తల్లికుమారుడు విగత జీవులుగా కనిపించారు. సమాచారం అందుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అత్తమామలే చంపేశారని అఖిల బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూమి లాక్కోవడం అన్యాయం


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చిన్నకంజర్ల రైతులు

పటాన్‌చెరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల కాలంగా భూమిని నమ్ముకొని జీవిస్తున్న తమను అన్యాయం చేయడానికి అధికారులు పూనుకున్నారని రైతులు చెప్పారు. మంగళవారం ఇంద్రేశం మున్సిపల్ పరిధి చిన్నకంజర్ల గ్రామ రైతులు పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి మాట్లాడారు. గ్రామంలోని 187 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే ఆర్డీవో ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి అభిప్రాయాలు తీసుకున్నారని అన్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేసి మాభూమి మావద్దే ఉంచేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాయత్రి, గణపతిరాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగి ఆత్మహత్య


రాంబాబు

రామచంద్రాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ కథనం ప్రకారం... నగరంలోని కర్మన్‌ఘాట్‌కు చెందిన రాంబాబు(41) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఉస్మాన్‌నగర్ సైబర్ కాలనీలో నివాసముంటూ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి రాంబాబు ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులతోనే రాంబాబు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు

రాంనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

● రూ.2.50 లక్షల అపహరణ ● గజ్వేల్ ఏసీపీ విచారణ


రాంనగర్‌లో విచారణ జరుపుతున్న గజ్వేల్ ఏసీపీ నర్సింలు

జగదేవ్‌పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జగదేవ్‌పూర్ మండలంలోని రాంనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని యువకులు ఇంట్లోకి చొరబడి రూ.2.50 లక్షల నగదును అపహరించారు. గ్రామానికి చెందిన కోట రామచంద్రం కుటుంబీకులు ఇంటికి తాళం వేసి కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామానికి బంధువుల ఇంటికి సోమవారం రాత్రి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగొచ్చి చూసేసరికి బీరువా తాళం తెరిచి ఉండడంతో గమనించిన పరిశీలించగా.. బీరువాలో ఉంచిన రూ.2.50 లక్షల నగదు అపహరణకు గురైందని గుర్తించారు. స్థానికులు, కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ్వేల్ ఏసీపీ నరసింహులు, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చే రుకుని క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. కాగా బీరువాలో బంగారు ఆభరణాలు ఉన్నా నగదు మాత్రమే చోరీ కావడంపై అనుమానాలకు తావిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పస్తాపూర్‌లో వ్యక్తి హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జహీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన జహీరాబాద్ మండలంలోని పస్తాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఝరాసంగం మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన మహబూబ్(30) ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఇంట్లో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తర్వాత జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ సమీపంలో గల శ్మశాన వాటిక వద్ద శవమై కన్పించాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ శివలింగం సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పరిహారం ఇవ్వనిదే రోడ్డు వేయొద్దు

● పనులను అడ్డుకున్న రైతులు


అధికారులతో వాగ్వాదం చేస్తున్న బాధిత రైతులు

రామచంద్రాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పరిహారం ఇవ్వనిదే తమ భూముల నుంచి రోడ్డు వేయొద్దంటూ బాధిత రైతులు మంగళవారం అధికారులతో వాగ్వాదానికి దిగారు. తెల్లాపూర్‌లోని మే ఫేయర్ విల్లాల నుంచి ఉస్మాన్‌నగర్, గోపన్‌పల్లి రోడ్డు వరకు రోడ్డు వేయడానికి అధికారులు కాంట్రాక్టర్‌తో సహా వచ్చారు. అక్కడున్న రైతులు భూమిని ఇవ్వడానికి నిరాకరించారు. అయినా కాంట్రాక్టర్ రోడ్డు వేయడానికి ప్రయత్నించడంతో వాగ్వాదానికి దిగారు. రైతుల సమస్యను పరిష్కరించి రోడ్డు వేయాలని మాజీ కౌన్సిలర్ కంజర్ల శ్రీశైలం తెలిపారు. ఈ రోడ్డును ఓ బిల్డర్ కోసం వేస్తున్నారంటూ రైతులు డాకరెడ్డి రవీందర్‌రెడ్డి, ఆవుల మురళీయాదవ్, కంజర్ల కుమార్, కంజర్ల మల్లేశ్, ఆవుల లక్ష్మయ్యయాదవ్, ఆవుల గణేష్‌యాదవ్ తదితరులు ఆరోపించారు.

వాహన తనిఖీల్లో రూ.30 లక్షలు పట్టివేత

చేగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చేగుంట మండలం మక్క రాజుపేట శివారు పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రూ. 30,59,500 నగదు పట్టుబడింది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని మక్కరాజు పేట వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. గజ్వేల్ మండలం దాచారంకు చెందిన గుండెల్లి యాదగిరి, శిరీషలు బైక్‌పై వెళ్తుండగా, ఆపి తనిఖీ చేశారు. బ్యాగులో రూ. 30,59,500 లభించాయి. సదరు నగదుకు సరైన ఆధారాలు చూపలేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

● సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు


సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ఏపీహెచ్‌బీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్/చేగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి);: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ఏబీహెచ్‌బీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనపై ఆరా తీశారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మణ్, టీచర్ వందన తదితరులు ఉన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం చాలా సంతోషమని జిల్లా విద్యాధికారి విజయ పేర్కొన్నారు. మంగళవారం చేగుంట మండల పరిధిలోని చందాయపేట పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుంచొ పదవ తరగతి వరకు గణితశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సహకారంతో చావలి లక్ష్మీసుబ్రహ్మణ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 51 మంది విద్యార్థులకు రూ.43, 350 అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ ప్రధానోపాధ్యాయులు విట్టల్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, జిల్లా తపస్ ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఉపాధ్యాయులు నర్సింలు, సలీం, వీణ, రాములు, గిర్ధర్ ,స్వప్న శ్రీనివాస్ బంగారయ్య, సౌజన్య దామోదర్ ,యాదగిరి, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై సర్కార్ నిర్లక్ష్యం

● టీయూడబ్ల్యూజే ఐజేయూ కమిటీ

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే ఫైసల్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్, ఆసిఫ్ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో రాష్ట్రప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఈ నెల 3న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు జర్నలిస్టులు భారీగా తరలి రావాలని ఆయన కోరారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు తదితర సమస్యలను పట్టించుకోని ప్రభుత్వానికి సమష్టిగా బుద్ధి చెప్పేందుకు జర్నలిస్టులు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.



తూప్రాన్ మండలం కిష్టాపూర్ నుంచి వచ్చిన, చెట్లకింద కూర్చున్న మహిళలు

రోజంతా పడిగాపులు

తూప్రాన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ కోసం వచ్చిన మహిళలు రోజంతా చెట్ల కింద పడిగాపులు కాశారు. కిష్టాపూర్‌కు చెందిన ఓ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు మహిళలను పెద్దఎత్తున తీసుకువచ్చాడు. మహిళలు భారీగా రావడంతో నామినేషన్ రావడానికి అనుమతించలేదు. పోలీసుల బారికేడ్ల ప్రదేశంలో కూర్చోవడానికి అవకాశం లేకపోవడంతో ఇబ్బందులుపడ్డారు. అక్కడే ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే మట్టి రోడ్డులో కిందే కూర్చోగా.. మరికొందరు సమీపంలో డాక్యుమెంటరీ రైటర్ల కార్యాలయాల మెట్లపై కూర్చున్నారు.



ఖేడ్‌లోని మీసేవ కేంద్రంలో ధ్రువపత్రాల కోసం వేచి ఉన్న ఆశావాహులు

రద్దీగా మీసేవ సెంటర్లు..

నారాయణఖేడ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ డివిజన్‌లో ఈనెల 3 నుంచి మూడోవిడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో పోటీలో ఉండేందుకు ఆసక్తి ఉన్న వారు అవసరమైన కుల ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాల్లో మంగళవారం దరఖాస్తు చేసుకునేందుకు రావడంతో రద్దీ నెలకొంది. దీనికితోడు ఓటర్ల జాబితాతో పాటు ఇతర ధ్రువపత్రాల జిరాక్స్‌ల కోసం జిరాక్స్ సెంటర్లకు రావడంతో అక్కడా రద్దీ కనిపించింది.



గొటిగర్‌పల్లి గ్రామపంచాయతీ నామినేషన్ల పర్వంలో గిరి పుత్రులు

సంప్రదాయ దుస్తుల్లో నామినేషన్‌కు..

కోహీర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి గ్రామంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి సిద్ధాపూర్, గోపినాయక్, సేడిగుట్టతండాలకు చెందిన గిరిజన మహిళలు తమ సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. నామినేషన్ దాఖలకు చేసేందుకు వచ్చిన అభ్యర్థితో నృత్యాలు చేసి సందడి చేశారు. సిద్ధాపూర్‌తండా, గొటిగర్‌పల్లి గ్రామాలు ఎస్టీ రిజర్వుడు కావడంతో తండాల నుంచి నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు మద్దతుగా గిరిజనులు తరలివచ్చారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

● గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పరిశీలకులు భారతి లక్పతినాయక్



చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న భారతి లక్పతినాయక్

చిన్నశంకరంపేట/చేగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్, వార్డుల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పరిశీలకులు భారతి లక్పతినాయక్ అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని రెండో దఫా ఎన్నికల నేపథ్యంలో మూడోరోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ సరళిని, పత్రాలను పరిశీలించి మాట్లాడారు. సర్పంచ్, వార్డుల నామినేషన్లను స్వీకరించేందుకు పత్రాలను సరిచేసే విధంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కృషిచేయాలని సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన అభ్యర్థులు సర్పంచ్, వార్డులకు నామినేషన్లు దాఖలు చేశారు. ఆఖరిరోజు కావడంతో రాత్రి వరకూ నామినేషన్ కేంద్రాలు రద్దీగా మారాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ ప్రభుదాస్, ఎంపీవో గిరిజా రాణి పాల్గొన్నారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయం, ఎమ్మార్సీ భవన్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పరిశీలకులు భారతి లక్పతినాయక్ మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్ ఉన్నారు.

గంట వ్యవధిలోనే సొంత గూటికి..!

● వర్గల్ మాజీ ఎంపీటీసీ భర్త విచిత్రం




ఇటు కాంగ్రెస్, అటు బీఆర్‌ఎస్ కండువా కప్పుకుంటున్న స్వామి

వర్గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా వర్గల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ ఎంపీటీసీ బాగనోల్ల స్వాతి భర్త స్వామి మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇది జరిగిన గంట వ్యవధిలోని ఆయన తిరిగి సొంత గూడైన బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు దేవగనిక నాగరాజు బీఆర్‌ఎస్ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సర్పంచ్ పదవికి వయస్సు అడ్డు కాదు

● నంగునూరు బరిలో 77 ఏళ్ల వృద్ధుడు



దేవులపల్లి చంద్రయ్య(ఫైల్)

నంగునూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలని ఆ గ్రామాలను పరిపాలించేందుకు వయసు అడ్డురాదని నిరూపించాడు ఓ వృద్ధుడు. ఎస్సీ రిజర్వుడు అయిన సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామపంచాయతీ అభ్యర్థిగా గ్రామానికి చెందిన దేవులపల్లి చంద్రయ్య(77) మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఒకపక్క యువత రాజకీయాల్లోకి రావాలని ఉవ్విళ్లూరుతున్న సమయంలో నంగునూరుకు చెందిన వృద్ధుడు తానేం తక్కువ కాదని బరిలో నిలడుతున్నాడు.

విక్రయానికి ప్రచార సామగ్రి







విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఎన్నికల ప్రచార సామగ్రి

నారాయణఖేడ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి కొన్నిచోట్ల నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగా.. మరికొన్నిచోట్ల ప్రారంభమైంది. దీంతో వ్యాపారులు అభ్యర్థుల అవసరాలకు అనుగుణంగా ప్రచార సామగ్రిని విక్రయానికి సిద్ధంగా ఉంచారు. వారివారి గుర్తుల జెండాలు, కండువాలు, డోర్ పోస్టర్లు, డమ్మి బ్యాలెట్ పేపర్లు, ప్రభుత్వానికి లెక్కలు సమర్పించేందుకు లెక్కల పుస్తకాలు, బ్యాడ్జీలు, ఓటర్ స్లిప్‌లు రెడీగా ఉంచారు. తమ పేర్లతో ప్రింటింగ్ చేయించుకునే వారికి గుర్తులతో కూడిన వాటిని తీసుకొచ్చి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు అభ్యర్థులకు ఎన్నికల అధికారులు కేటాయించే గుర్తులతో రెడీగా వీటిని అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా జిరాక్స్ సెంటర్లలో గ్రామాలు, వార్డులవారీగా ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచడంతో, పోటీలో ఉన్నవారు తమకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గుర్తులు పొందిన వారు వాటిని కొనుగోలు చేయగా, పొందని వారు గుర్తులు పొందిన అనంతరం కొనుగోలు చేయనున్నారు.

మటన్ బిర్యానీ రూ.150.. చాయ్‌కి రూ.10

● సర్పంచ్ ఎన్నికల ప్రచార ఖర్చులు ఇలా..

కోహెడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు పోటీ పడుతున్న అభ్యర్థుల ప్రచార ఖర్చుల ధరలను ఎన్నికల సంఘం నిర్ణయించింది. ప్రచార ఖర్చుల రోజువారీ వివరాలను ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోగా అధికారులకు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఖర్చుల వివరాలను ఇంతకన్నా ఎక్కువ చూపితే అంగీకరించబోమని అధికారులు తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారం కోసం సైకిల్ రిక్షా వినియోగిస్తే రోజుకు రూ.400, ఆటో రిక్షా అయితే రూ.1,500, టాటాఏస్ అయితే రూ.1,600గా నిర్ణయించారు. వెయ్యి పోస్టర్లకు రూ.5 వేలుగా ప్రకటించారు. నెత్తిన ధరించే టోపీకి రూ.40, టీషర్టుకు రూ.100 చెల్లించాలని పేర్కొన్నారు. ఒకరోజుకు కారు అద్దెను రూ.2,500గా, ఇన్నోవాకు రూ.3,500గా చూపాల్సి ఉంటుందన్నారు. కూర్చునేందుకు వినియోగించే ఒక్కో కుర్చీకి రోజుకు రూ.20గా, వీఐపీ కుర్చీ అయితే రూ.100 అద్దెగా నిర్ణయించారు. కూల్ డ్రింక్, వాటర్ బాటిల్‌కు రూ.20 చొప్పున, లస్సీకి రూ.35గా, వాటర్ ప్యాకెట్‌కు రూపాయి, టీకి రూ.10, కాఫీకి రూ.15 ధర చొప్పున లెక్క చూపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కిలో బరువున్న బాణసంచాకు రూ.800, ఒక డప్పుకు రూ.700 చెల్లించాలన్నారు. సాదా భోజనానికి రూ.80, మటన్ బిర్యానీకి రూ.150, చికెన్ బిర్యానీకి రూ.100 చొప్పున బిల్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

అద్దె వద్దు.. కొత్తవి ముద్దు..

● వంట సామగ్రి కొనుగోలు చేస్తున్న అభ్యర్థులు



నందిగామలో అభ్యర్థి విక్రమ్‌గౌడ్ మొబైల్ తరహాలో ఏర్పాటు చేసుకున్న మొబైల్ వాష్‌బేసిన్లు

పటాన్‌చెరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయంటే అభ్యర్థులను భయపెట్టేది పెట్టిన ఖర్చులకు లెక్క చూపించడం. ఈ విషయంలో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి సహకరిస్తున్న వారికి భోజనాలు పెట్టడం సర్వసాధారణంగా మారింది. భోజనం వండాలంటే కావాల్సిన సామాన్లు అద్దెకు తీసుకునే సమయంలో డిమాండ్ ఎక్కువయింది. 10 రోజుల పాటు ఉండేటట్టు అద్దె ప్రాతిపదికన మాట్లాడుకుంటున్నారు. ఇందుకు అద్దెలు భారంగా మారి కొత్తవి కొనుగోలు చేసుకున్నారు. ఇందులో భాగంగానే అభ్యర్థులు కొత్తవి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల్లో 10 రోజుల పాటు నిత్య భోజనాలు చేసిన తరువా చేతులు శుభ్రం చేసుకునే వాష్‌బేసిన్లను సైతం శాశ్వతంగా ఇనుము స్టాండ్లతో నిర్మించుకున్నారు.

ఎన్నికల కోసం పల్లెబాట

● గ్రామాల్లో తిష్టవేసిన పట్టణవాసులు ● వారిని, వారి కుటుంబాలను వింతగా చూస్తున్న ప్రజలు



గజ్వేల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్నానికి పరిమితమైన ఆయా గ్రామాల నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పల్లెల ముఖం పట్టారు. కుటుంబాలతో సహా పల్లెలకు వచ్చి ఇక్కడే తిష్ట వేస్తున్నారు. కేవలం పండుగలకు, పబ్బాలకు వచ్చే నాయకులు కుటంబాలతో సహా రావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. గ్రామాల్లో ఏదైనా కష్ట, సుఖాలు ఉన్నప్పుడు గ్రామస్థులు రావాలని కోరితే కానీ రాని నాయకులు ప్రస్తుతం ఎన్నికల వేళ గ్రామాలకు రావడంతో గ్రామాల్లో కొత్త చర్చ తెరలేసింది. ఏ కార్యానికి పిలిచినా కుటుంబంతో సహా రానోళ్లు ఇప్పుడు ఇంటిల్లాదులు వచ్చి తిష్టవేశారు.. వాళ్ల అవసరమా లేక ప్రజలను బురిడీ కొట్టించి ఓట్లు దండుకుని మళ్లీ పట్నానికి చేరుకునే ఆలోచనా అని గుసుక్కుంటున్నారు. అంతేకాకుండా తమ అనుచరులను బరిలో నిలపడం, తామే బరిలో నిలవడం, వారి తరఫున ప్రచారం చేస్తుండడం, లేదా వారే కుటుంబంతో సహా ప్రచారం చేస్తుండడంతో ప్రజల నుంచి మిశ్రమ స్పందన వస్తుంది.

ఓట్లేసుకుని వెళ్లిపోతరేమో

పట్నం వచ్చిన నాయకులను, వారి కుటుంబాలను పల్లెల్లో ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఓట్లని వచ్చిర్రు... ఓట్లవ్వగానే వెళ్లిపోతరు. మళ్లా పిలిచినా రారు.. పనులున్నాయని, చెప్పి తప్పించుకుంటరు. ఏదైనా పని ఉందని ఫోన్‌చేస్తే కూడా ఎత్తరు... ఇప్పుడు కాకా, అవ్వ అని మాట్లాడేటోళ్లే రేపు వీడికి ఏం పుట్టింది ఊరికే ఫోన్ చేస్తుండు అని తమ అనుచరులకు ఫోన్ చేసి మరీ కనుక్కుంటారని ఆయా రచ్చబండల వద్ద చర్చలు జరుగుతున్నాయి. పట్నం నుంచి వచ్చి పల్లెల్లో పోటీచేస్తున్న వారి పట్ల ప్రజల నుంచి అంతగా ఆశించిన స్పందన రావడం లేదని, గ్రామాల్లో ప్రజలను పట్టుకుని ఉన్న వాళ్ల పట్ల మాత్రమే ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారని తెలుస్తుంది. మంచి, చెడు ఉన్నా ఊళ్లో ఉంటాడు.. ఏదైనా అయితే ఇంటికి వెళ్లి పని చేయించుకోవచ్చు. ఈ పట్నంలో ఉండెటోళ్లకు ఓటు వేసినా దండుగే అన్న భావన సగటు గ్రామ ప్రజల్లో వ్యక్తమవుతున్నది.

అభ్యర్థులకు తలనొప్పిగా మారిన వలసలు



ఖేడ్ నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్న గిరిజనులు

నారాయణఖేడ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు వలసలు తలనొప్పిగా మారాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం చెరకు సీజన్‌లో గిరిజనులు 50 శాతం చక్కెర కర్మాగారాల వద్ద పని చేయడానికి కుటుంబసభ్యులతో కలిసి వలసలు వెళ్తారు. ప్రస్తుతం చక్కెర కర్మాగారాల్లో క్రషింగ్ ప్రారంభం కావడంతో, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ఎద్దుల బండ్లపై గిరిజనులు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా గిరిజనులు నారాయణఖేడ్‌లో ఉన్నారు. నియోజకవర్గంలో 52 గిరిజన తండాలు ఉన్నాయి. సాధారణంగా ఖేడ్ ప్రాంతం నుంచి దాదాపు 50 వేల మంది శాశ్వతంగా హైదరాబాద్, ముంబయి, లాతూర్, సోలాపూర్, తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. దీనికితోడు సీజనల్ వలసలు వెళ్తుండడంతో ఎన్నికల వేళ వారి ఓట్లు వేయించుకునేందుకు వారిని స్వగ్రామాలకు తీసుకురావాల్సి ఉంటుంది. దీంతో పోటీలో ఉన్న వారు తమతమ గ్రామపంచాయతీ పరిధిలో ఎవరు.. ఏ ప్రాంతానికి వలస వెళ్లారనే విషయాలను సేకరించడం ప్రారంభించారు. గిరిజనులు దాదాపు 20 వేల మంది వరకు వలసలు వెళ్తారని, ఈ క్రమంలో నియోజకవర్గంలోని 226 గ్రామపంచాయతీల్లో ప్రతి పంచాయతీ నుంచి 200 మందికి తగ్గకుండా వలస వెళ్లారని, వారందరినీ ఎన్నికల రోజున ఓటు హక్కు వినియోగించుకోవడానికి తీసుకురావడం పోటీలో ఉన్న అభ్యర్థులకు తలనొప్పిగా మారనుందని అంటున్నారు.

సైబర్ మోసాలకు చెక్ పెడదాం



స్థానిక ఎన్నికల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్/పాపన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'మీ భద్రత మీ చేతుల్లోనే.. ఆలోచించండి.. చెక్ చేసుకోండి.. సురక్షితంగా ఉండండి... సైబర్ మోసగాళ్లను దూరం పెట్టండి..' అని మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రారంభమైన ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పేరుతో 6 వారాల ప్రచార ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర డీజీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల, విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిజ్ఞ, పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హన్సన్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి చెక్‌పోస్టును ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పాపన్నపేట మండల పరిధి కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ, కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ జార్జ్, ఎస్బీ సీఐ సందీప్‌రెడ్డి, సీసీఎస్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ సార శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికలు వద్దు

● బహిష్కరించిన తండావాసులు
● అధికారుల హామీతో నామినేషన్లకు అంగీకారం



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న తండావాసులు

వట్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబోజిగూడ తండావాసులు తమ తండాలోని రెండు వార్డులకు జరగనున్న ఎన్నికలను బహిష్కరించగా, అధికారులు వారికి నచ్చజెప్పి నామినేషన్లు వేయించారు. వివరాలు.. వట్‌పల్లి గ్రామపంచాయతీలో కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబోజిగూడ తండాను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిరాల తండా గ్రామ పంచాయతీలో కలిపారు. దీంతో మంచిరాల గ్రామ పంచాయతీ పరిధిలో 7,8 వార్డులుగా అంబోజిగూడ తండా విస్తరించింది. అయితే, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తండావాసులు పలుమార్లు అధికారులకు విన్నపాలు అందజేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ ఈ తండావాసులు పాల్గొనలేదు. ఈ క్రమంలో ఎన్నికలు రాగా, బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎంపీడీవో సాయి తరుణ్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో ఎంపీడీవో, తహసీల్దార్ ఇతర అధికారులు తండాకు వెళ్లి మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పి నామినేషన్లు వేసేందుకు ఒప్పించారు. కార్యక్రమంలో జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ లవుకుమార్ తదితరులు ఉన్నారు.

నామినేషన్లకు వేళాయే..!



మద్దూరులో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో



చేర్యాల ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ సామగ్రి సరిచేసుకుంటున్న సిబ్బంది

కొమురవెల్లి/మద్దూరు/చేర్యాల/కోహెడ/హుస్నాబాద్‌రూరల్ /డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేటి నుండి ప్రారంభం కానుంది. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. మద్దూరు మండలంలో 10 గ్రామపంచాయతీలకు నామినేషన్లు స్వీకరించేందుకు మద్దూరులోని గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో, రైతువేదికలో ఏర్పాటు చేసిన కేంద్రంలోని ఆయా గ్రామాల వారి నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారని తెలిపారు. ధూళిమిట్ట మండలంలోని 11 గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో గ్రామాల వారి నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు తీసుకుంటారని తెలిపారు. చేర్యాల మండలంలో 20గ్రామాలలో 20సర్పంచు, 184 వార్డుసభ్యులస్థానాలు ఉన్నాయి. నామినేషన్ల స్వీకరణకు మండలంలో 6 క్లస్టర్లు ఏర్పాటుచేశారు. కోహెడ మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో ఆర్వో, ఏఆర్వో, ఆయా గ్రామాల జీపీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారు.హుస్నాబాద్ మండలంలో 17 గ్రామాలకు నామినేషన్లు ప్రారంభం కానున్నాయి.. నామినేషన్లు వేసేందుకు 5 క్లస్టర్ గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. క్లస్టర్ గ్రామాల్లో ఆయా గ్రామాలకు పోటీచేస్తున్న అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని ఎంపీడీవో రమేష్ తెలిపారు..

మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి

గజ్వేల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి కోరారు. గజ్వేల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా జిల్లాలోని రంగనాయకసాగర్, అనంతగిరి, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి భూనిర్వాసితుల సమస్యలను గూర్చి మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గతంలో దీక్ష చేశారని, ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలను స్వీకరించి రెండేళ్లు అయినా పట్టించుకోవడం లేదని, వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా పరిహారం, ప్యాకేజీ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో నిర్వాసితులం అంతా కలసి ఐక్య ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచి సమస్యలను పరిష్కరించుకుంటామని హెచ్చరించారు.

రాజ్యాధికార పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింగ్

గజ్వేల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రజ్ఞాపూర్ నర్సింగ్‌ను నియమిస్తూ సిద్దిపేట జిల్లా టీఆర్‌పీ ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌పీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నర్సింగ్ మాట్లాడుతూ... టీఆర్‌పీ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తానని ప్రకటించారు. తనకు పదవిని ఇచ్చిన టీఆర్ పీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధగాని హరిశంకర్‌గౌడ్, మాదం రజనీకాంత్, జిల్లా అధ్యక్షుడు తుప్పతి భిక్షపతికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన తొగుట మార్కెట్ కమిటి చైర్మన్



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి సన్మానిస్తున్న తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి

తొగుట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను మంగళవారం తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన చెరుకు విజయ్ రెడ్డి మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి పాటుపడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, లక్కిరెడ్డి నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకాడమిక్ ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అకాడమిక్ ఆడిట్ జరిగింది. తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశానుసారం అకాడమిక్ ఆడిట్ నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ గణపతి రావు కళాశాలను సందర్శించి కళాశాలలోని పలు విభాగాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కవీందర్

గజ్వేల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి దివంగత ఎన్ఎస్‌యూఐ నాయకుడు కవీందర్ కృషి చేశారని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్ అన్నారు. కవిందర్ 11వ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఎంసీహెచ్‌లో అల్పాహారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట నాయకులు నంగునూరి సత్యనారాయణ, నక్కరాములు, శ్రీను, రమేశ్‌గౌడ్, అజ్గర్, శివులు, యాదగిరి, అరుణ్, డప్పు గణేశ్, కనకయ్య, సుదర్శన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సత్తయ్య, కనకయ్య, చంద్రశేఖర్, మల్లేశ్‌గౌడ్, సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు.

వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ



వంటిమామిడి సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు

ములుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా వంటిమామిడి సరిహద్దు వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఎస్ఎస్‌టీ ఇన్‌చార్జి ఏపీఎం యాదగిరి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఎస్సై సుబాష్, ములుగు హెడ్ కానిస్టేబుల్ లింగారెడ్డి, కానిస్టేబుల్ మాలాశ్రీతో పాటు తదితరులున్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్లు సరిచేయరూ..

మద్దూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని రెండేళ్లుగా లైన్‌మెన్‌కు చెబుతున్నా పట్టించుకోవడం లేదంటూ ధూళిమిట్ట మండలంలోని దుబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్యానాయక్ తండా రైతులు వాపోతున్నారు. ఈ విషయమై రైతులు జాటోతు సుమన్, తిరుపతి, రామోజీ మాట్లాడారు. రెండేళ్లుగా విద్యుత్ వైర్లు వేలాడుతుండటంతో సాగు చేసిన వరి పంటలకు కోతల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వేలాడుతున్న విద్యుత్ వైర్ల మూలంగా వరి కోతల మిషన్ నిర్వాహకులు రావడం లేదని. విద్యుత్ వైర్లు సరిచేసాకే వస్తామని చెబుతున్నారన్నారు. వరి కోతల సమయంలో ఎల్‌సీ తీసుకుంటూ వరి కోతలు ప్రారంభించాల్సి పరిస్థితులున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను చూపుతున్న రైతులు

సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

దౌల్తాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం దౌల్తాబాద్ మండలకేంద్రంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మాట్లాడుతూ. కార్మిక,ఉద్యోగుల,హక్కుల పరిరక్షణ కోసం, నిరంతరం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు 2025 డిసెంబరు 7, 9వ తేదీల్లో మెదక్ పట్టణంలో జరుగుతాయన్నారు. కార్మిక మహా ప్రదర్శన బహిరంగ సభకు కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ బహిరంగ సభకు ముఖ్యతిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు, సీఐటీయూ అఖిలభారత అధ్యక్షురాలు కే.హేమలత పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. అంగన్వాడీ,ఆశా,బీడి, గ్రామ పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, మెడికల్ హెల్త్, మధ్యాహ్న భోజన,మెప్మా, ఆర్పి,వీఓఏ,ఆటో, హామాలీ, భవన నిర్మాణ, పరిశ్రమల కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను తెచ్చిందని విమర్శించారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి



దుద్దెడ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వం అందచేస్తున్న యాదగిరి

కొండపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని గురుకులాల టైం టేబుల్ మార్చాలని టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం టీఎస్ యూటీఎఫ్ కొండపాక మండల సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది.

యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరపు కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుల ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి అందరికీ పాత పెన్షన్ అమలు చేయాలన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమస్యలను పరిష్కరించాలి

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డబుల్‌బడ్‌రూం ఇళ్ల కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులు డబుల్‌బెడ్‌రూం కాలనీలో పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యల గురించి ప్రజలని అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, వీధిలైట్లు లేక నివాస ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేయాలని కోరారు. మంత్రి స్పందించి కాలనీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల వికాస్‌యాదవ్, జేరిపోతుల లక్ష్మణ్,సునీత తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో కంటి పరీక్షలు



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్

మద్దూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆప్తాల్మిక్ అఫీసర్ ఎం. భాస్కర్‌రెడ్డి విద్యార్థినులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 221 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 23 మంది బాలికలు దృష్టిలోపంతో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. దృష్టి లోపం రాకుండా ఉండేందుకు ఎక్కువగా ఆకుకూరలు, తాజా కూరగాయలతో పాటు సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలని సూచించారు. టీవీలతో పాటు మొబైల్స్ ఎక్కువ సేపు వాడకూడదన్నారు. అవసరం మేరకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు

రాయపోల్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రాయపోల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్సై మానస ఆధ్వర్యంలో పోలీసులు రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి, రాంసాగర్, రాయపోల్ గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని ప్రజలకు సూచించారు. ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్యూఆర్టీ టీమ్, సిబ్బంది పాల్గొన్నారు.



రాయపోల్‌లో సీఐ లతీఫ్, ఎస్ఐ మానస ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పంచాయతీ ఎన్నికలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అభిలాష్

మర్కుక్/కోహెడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామస్థులు సహకరించాలని కోహెడ ఎస్సై అభిలాష్ కోరారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బైండ్ ఓవర్ అయిన వ్యక్తులకు ఎన్నికలపై ఆయన అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. మర్కుక్ మండలంలోని గ్రామపంచాయతీల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ మరియు వార్డుమెంబర్ పదవులకు నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ దామోదర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి, నామినేషన్ ప్రక్రియ, ఆచరణ నియమాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గురించి ఆయన అవగాహన కల్పించారు.

ప్రజలకోసం నిలబడే సత్తా బీఆర్ఎస్‌కే ఉంది

చేర్యాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి గెలిచిన సర్పంచులెవరూ ప్రజలకోసం పోరాడబోరని, ప్రజల కోసం నిలబడే సత్తా కేవలం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకే ఉందని జన గామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రేణుకా గార్డెన్స్‌లో మంగళవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు,ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ రెండేళ్ల పాలన బేరీజు వేసుకుని తేడాపట్ల స్పష్టంగా చర్చ పెట్టాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమై ప్రజలను మోసపుచ్చిందన్నారు. ప్రభుత్వంపై తాను ప్రజల తరుపున పోరాడాలంటే పార్టీ సర్పంచులు, ఎంపీటీ సీలు అవసరమని, అందుకు ఐక్యంగా ముందడుగువేయాలని సూచించారు. అనంతరం పలు గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



చేర్యాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ముగిసిన రెండోవిడత నామినేషన్ల ఘట్టం

(7వ పేజీ తరువాయి)

గత ఎన్నికలలో సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయారు. అయినప్పటికీ గ్రామ ప్రజలకు, అభివృద్ధికి దూరంగా ఉండకుండా అండగా నిలిచామని, ఈసారైనా తమను ఆశీర్వదించి గెలిపించాలని కోరుతూ ప్రశాంత్, స్రవంతి ఇద్దరూ భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు. ఇది చూసిన గ్రామస్థులు కూడా చలించిపోయారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

రెండో విడత నామినేషన్లకు చివరి రోజు కావడంతో, అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న తొగుట మండలం గుడికందులలో, చిన్నకోడూర్ మండలం ఇబ్రహీంనగర్‌లో, నంగునూరు మండలం గట్లు మల్యాలలో, నారాయణరావుపేటలో, చిన్నగుండవెల్లిలో, రాఘవాపూర్‌లో, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రుద్రారంలో అభ్యర్థులు క్యూలైన్‌లో బారులు తీరారు. ఈ మేరకు నామినేషన్ల తీరును జిల్లా కలెక్టర్ హైమావతి, ఎన్నికల అబ్జర్వర్ హరిత వేర్వేరుగాపరిశీలించారు.



అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రుద్రారం గ్రామంలో నామినేషన్ దాఖలు చేసేందుకు క్యూలో నిల్చున్న అభ్యర్థులు

సీఎంపైనే ఆశలు

(7వ పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఈ రెండు ప్రధాన సమస్యల పరిష్కారంపై హామీ ఇవ్వాలని కోరుతున్నారు. వీటితో పాటు రింగ్ రోడ్డు, మినీ ఐటీడీఏ వంటి పలు అభివృద్ధి పనుల వరాలనూ ముఖ్యమంత్రి కురిపిస్తారని ప్రజలు ఆశగా ఉన్నారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ విజయ్‌కుమార్

బహిరంగ సభను విజయవంతం చేయండి

● మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో పాటు మరిన్ని హామీలు కూడా ఇస్తారని ఆయన తెలిపారు. బుధవారం ఆయన పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు.

సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో గతంలో హుస్నాబాద్ పర్యటన సందర్భంగా హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని హుస్నాబాద్ బీజేపీ నాయకులు మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి హామీ ఇచ్చారని బీజేపీ నాయకుడు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, హుస్నాబాద్, అక్కన్నపేట మండల అధ్యక్షులు భూక్య సంపత్‌నాయక్, రామంచ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ విద్యాసాగర్, వెల్దండి రాజేంద్రప్రసాద్, తగరం లక్ష్మణ్, పోలోజు రవీందర్, బాలరాజు,స్ఫూర్తి అధ్యక్షులు పందిల్ల శంకర్, వడ్డెపల్లి మల్లేశం తదితరులు ఉన్నారు.

గౌరవెల్లి రిజర్వాయర్‌పై మాటలు తప్పా పని లేదు

- గడచినా రెండెళ్లలో తట్టెడు మట్టి తీయలేదు
- ప్రభుత్వ ఆసుపత్రిని ఎందుకు కూల్చారో మంత్రి చెప్పాలి

హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గౌరవెల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి పంట పొలాలకు నీరందిస్తామని గొప్పలు చెప్పిన మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారంలోకి వచ్చి రెండెళ్ళు గడచినా ఇప్పటి వరకు తట్టెడు మట్టి తీయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగం మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి అన్వర్, వంగ వెంకట్రాంరెడ్డిలు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలను ప్రలోభ పెట్టెందుకు సీఎం మీటింగ్ పెడుతున్నారని, ఎలక్షన్ కమిషన్ దీనిపై విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. రూ. 2 కోట్లతో ఆర్టీసీ బస్ స్టేషన్‌ను మరమ్మత్తులు చేయిస్తే చిన్న వర్షానికి జలమయం అవుతుందని, అలాగే కొత్తగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని కూల్చారని, ఏం ఆశించి ఈ పనులు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రియాంక గాంధీ ఎన్నికల ముందు ఇచ్చిన మెడికల్ కాలేజీ హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మడప ప్రభాకర్‌రెడ్డి, గీకురు వెంకటేశం, అనుమాండ్ల ప్రభాకర్‌రెడ్డి, మహేశ్ తదితరులున్నారు.